ప్రచార యావ.. ప్రమాదానికి తోవ!

- ముఖ్య కూడళ్లు, సర్కిళ్లలో అడ్డగోలుగా కటౌట్లు, ఫ్లెక్సీలు
- సర్కిళ్లు, డివైడర్లను వదలని ప్రకటన దారులు
- అనుమతులు లేకుండా వెలుస్తున్న హోర్డింగులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద అనధికారికంగా వెలిసిన నంద్యాల ఎంపీ బైరెడి శబరికి చెందిన భారీ కటౌట్ ఈనెల 6వ తేదీ ఉన్నట్లుండి కూలిపోయింది. భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ కటౌట్ కాస్తా అక్కడే ఉన్న ఎలక్ట్రికల్ హెవీ టెన్షన్ వైర్ల మీద పడింది. దీంతో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల సమీపంలోని ఎంజీ బ్రదర్స్ ఆఫీసులోని కంప్యూటర్లు, సీపీయూలు, ప్రింటర్లు కాలిపోయాయి. అక్కడే ఉన్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు పనిచేయలేదు. అదృష్ట వశాత్తు ప్రధాన రహదారిలో ప్రయాణించే ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కటౌట్ ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని నగరవాసులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలకు అడ్డాగా మారుతున్న కటౌట్లు, ఫ్లెక్సీలపై అధికారులు ఇప్పటికైన స్పందించాలని కోరుతున్నారు.


గాయత్రీ ఎస్టేట్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బ్యానర్లు


సి.క్యాంపు సర్కిల్ వద్ద 8 నెలల క్రితం ఏర్పాటు చేసిన భారీ కటౌట్

కర్నూలు (టౌన్): నగరంలో ఎక్కడబడితే అక్కడ బ్యానర్లు, ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ముఖ్య కూడళ్లలో, ప్రధాన రహదారుల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో అవి విరిగి పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చర్యలు తీసుకొని తొలగించాల్సిన నగరపాలక అధికారులు నెలలు గడుస్తున్నా చోద్యం చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముఖ్య కూడళ్లు, సర్కిళ్లలో అడ్డగోలుగా కటౌట్లు, ఫ్లెక్సీలు

గతేడాది జూన్ నుంచి నగరంలో గతంలో ఏన్నడూ లేని విధంగా ఎక్కడబడితే అక్కడ బ్యానర్లు, భారీ కటౌట్లు వెలుస్తున్నాయి. ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. చిన్నా, చితకా కార్యక్రమం, ప్రారంభోత్సవం నాయకుల ఆహ్వానం, ఇలా.. ప్రతిదీ విపరీతమైన ప్రచారంతో ప్రజలకు ఇబ్బందిగా పరిణమిస్తోంది. నగరంలోని సి.క్యాంపు సర్కిల్, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా, మౌర్య ఇన్, పాత బస్టాండ్, ప్రకాష్ నగర్ ఇలా.. అనేక చోట్ల భారీ స్థాయిలో కటౌట్లు వెలిశాయి. అవి ఏర్పాటు చేసి నెలలు గడుస్తోంది. కొన్ని చోట్ల రోడ్లపైనే ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇబ్బందిగా కరంగా ఉంటోంది. రెండు రోజుల క్రితం భారీ స్థాయిలో ఉన్న కటౌట్ కూలిపోయింది. అదృష్ట వశాత్తు రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయినా మున్సిపల్ అధికారులు తమకేం సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు.

సర్కిళ్లు, డివైడర్లనూ వదలట్లేదు

నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ముఖ్య కూడళ్లలో సర్కిళ్లు ఏర్పాటు చేశారు. నగరంలోని సర్కిళ్లను నగర పాలక అధికారులు అందంగా తీర్చిదిద్దారు. గ్రీనరీని ఏర్పాటు చేశారు. రాజ్ విహార్, బళ్లారి చౌరస్తా, రాజీవిహార్, పూలే సర్కిల్, ఆర్.ఎస్.రోడ్డు ఐదురోడ్ల కూడలి, చిరంజీవి పార్కు, గాయత్రీ ఎస్టేట్, గుత్తి పెట్రోల్ బంకు ఇలా అనేక చోట్ల సర్కిళ్లు ఉన్నాయి. అలాగే కిలో మీటర్ల కొలది డివైడర్లు ఏర్పాటు చేశారు. గ్రీనరీ పెంచి అందంగా తీర్చిదిద్దారు. అయితే ఇటీవల నగర పాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది ఉదాసీనత వైఖరి వల్ల వాటిని పాడు చేస్తున్నారు. మహానాయకుల విగ్రహాలకు అడ్డగా కూటమి నేతల ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు. గడువు దాటినా అలానే ఉంచుతున్నారు. అనుమతులు లేకున్నా. ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అనుమతులు లేకున్నా ..

నగర పరిధిలో ప్రచారం కానీ, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు తీసుకోవాలి. నిర్దేశించిన రుసుం చలానా రూపంలో చెల్లించాలి. అలాగే సర్కిళ్లలో ఎట్టి పరిస్థితుల్లో వీటిని ఏర్పాటు చేయకూడదన్న నిబంధనలు ఉన్నాయి. ఇవేమీ పట్టించుకోకుండా ఎక్కడబడితే అక్కడ వెలుస్తున్నాయి. దీంతో ప్రణాళిక విభాగానికి గణనీయంగా అదాయం తగ్గిపోయింది.

మున్సిపల్ సమావేశంలో ప్రకటించినా.. చర్యలు శూన్యం

కటౌట్లు, ఫ్లెక్సీపై మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గత నెల 30వ తేదీ నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో నిర్వహించిన నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో 17వ వార్డు కార్పొరేటర్ కైపా పద్మాలతా రెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నగరంలో కూడళ్లలో బ్యానర్లు నిషేధిస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అదే సమావేశంలో ప్రకటించారు. అనుమతులు లేకుండా, ఎక్కడ పడితే అక్కడ బ్యానర్లు ఏర్పాటు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే ప్రకటన చేసి ఇప్పుడు 20 రోజులు అవుతున్నా ఎక్కడి ఫ్లెక్సీలు, బ్యానర్లు అక్కడే ఉన్నాయి.

క్లుప్తంగా

ఉపయోగం లేని గిరిజన భవన్

కర్నూలు(రూరల్): జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలోని గిరిజన భవన్‌తో గిరిజనులకు ఎలాంటి ఉపయోగం లేదని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కైలాస్ నాయక్ అన్నారు. కర్నూలు నగర సమీపంలోని దిన్నెదెవరపాడులో ఉన్న గిరిజన్ భవన్‌ను గత ప్రభుత్వం రూ.1.35 కోట్లతో నిర్మించిందని తెలిపారు. గిరిజనుల పెళ్లిళ్లు, శుభకార్యాలు నిర్వహించుకోవడానికి భవనం ఏర్పాటు చేశారన్నారు. అయితే ఈ భవనంలో ఇంతవరకు గిరిజనులు శుభకార్యాలు నిర్వహించలేదని చెప్పారు. కనీసం భవనానికి చేరుకోవడానికి సరైన రోడ్డు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారలు పట్టించుకోవడం లేదని తెలిపారు. కుర్చీలు, టేబుళ్లు, వంట సామగ్రి, నీటి సౌకర్యం లేనందున గిరిజనులు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదన్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

కర్నూలు మెడికల్ కాలేజీ 'శ్రీమంతులు'

కర్నూలు(రూరల్): కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన 2020–24 బ్యాచ్ విద్యార్థులు దిన్నెదేవరపాడు గ్రామంలోని పలు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం మొదటి విడతలో 60 మంది విద్యార్థులు 180 గృహాలను దత్తత తీసుకున్నట్లు సర్పంచ్ మాధవ స్వామి తెలిపారు. గ్రామంలోని మొత్తం 750 కుటుంబాలను దత్తత తీసుకుంటామని కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ఆ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తామన్నారు.

అర్జీల స్వీకరణ

కల్లూరు: ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినతులను అధికారులు విచారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి, పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

బీజేపీ నాయకుల సంబరాలు


మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

కర్నూలు కల్చరల్: ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచుకొని టపాసులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు. కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ ప్రజలు గొప్ప విజయాన్ని అందించారన్నారు. బీజేపీ నాయకులు రామస్వామి, ప్రేమ్‌కుమార్, నాగరాజ్, సాయి ప్రదీప్, మాలతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కర్నూలు : కర్నూలు బళ్లారి చౌరస్తాలోని టీవీఎస్ షోరూమ్‌కు ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన బోయ అయ్యన్న (80) మృతిచెందాడు. శనివారం మధ్యాహ్నం నగరంలో నుంచి వీకర్ సెక్షన్ కాలనీకి నడుచుకుంటూ వెళ్తుండగా కల్లూరు వైపు నుంచి కోడుమూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. లారీతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవితో పాటు కూతురు ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రమాద సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

ఆ ఇంజినీరింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి


ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కల్లూరు: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, పీఎస్ఎన్ జిల్లా కన్వీనర్ అమర్, రాయలసీమ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజులో కూడా కళాశాలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థి సంఘాల నాయకులు మనోహర్, శంకర్, జితేంద్ర, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు నిబంధనలు సడలించాలి

కర్నూలు (అర్బన్) : కూటమి ప్రభుత్వం కాపు, బలిజ కులాల వారికి స్వయం ఉపాధి పథకం ద్వారా అందజేస్తున్న సబ్సిడీ రుణాలకు నిబంధనలు సడలించాలని కర్నూలు నగర బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పథకం, నమోదు చేసుకోవడానికి చివరి తేదీలు సరిగా ప్రచారం చేయకపోవడం వల్ల చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారన్నారు. అలాగే దరఖాస్తు చేసుకోవడానికి కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కనుక, ఆ పత్రం పొందడానికి మూడు నాలుగు రోజుల సమయం పడుతుందన్నారు. కాబట్టి ఈ నెల ఆఖరి వరకు దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పించాలని కోరారు. అలాగే దరఖాస్తు చేసుకోవడానికి వయోపరిమితి 50 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం ప్రధాన సలహాదారులు పత్తి ఓబులయ్య, సింగంశెట్టి సోమశేఖర్, ఈశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.

ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో కర్నూలుకు పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు ఢిల్లీ నగరంలో అంతర్జాతీయ వాకో ఇండియా కిక్స్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. జిల్లాకు చెందిన గుర్రం జయకళ్యాణ్, ఉపేంద్ర, ఈశ్వర్ వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు కిక్ బాక్సింగ్ రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర ఆచారి శనివారం తెలిపారు.

పరమ పవిత్రమైనది భీష్మ ఏకాదశి


భీష్మ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న నేతలు


లలితా పీఠంలో స్వామివారికి పుష్పాభిషేకం చేస్తున్న మహిళలు


కోదండరామస్వామి ఆలయంలో నినాదాలు చేస్తున్న గంగపుత్రులు

కర్నూలు(అర్బన్): భీష్మ ఏకాదశి పరమ పవిత్రమైనదని బెస్త గంగ పుత్ర సంఘం, జాతీయ మత్స్యకారుల సంఘం నేతలు అన్నారు. శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పెద్దపాడు రోడ్డులోని గంగపుత్ర భవనంలో భీష్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. గంగపుత్ర సంఘం పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కోతిమీరా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బెస్త సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు టీ అనీల్‌కుమార్, జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బెస్త శ్రీనివాసులు, కోశాధికారి శేషశయన, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీ మద్దిలేటి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పట్టణ అధ్యక్షుడు టీ గోవిందు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు

కర్నూలు కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో శనివారం భీష్మ ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి బృందం, శ్రీ విష్ణు సహస్రనామ సత్సంగం అధ్యక్షుడు పుల్లారెడ్డి, లలితా సంఘం అధ్యక్షులు జ్ఞానేశ్వరమ్మ ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ పారాయణం, సప్తహారతుల కార్యక్రమాలు జరిగాయి. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు. పెద్దమార్కెట్ సమీపంలోని రుక్మిణీ పాండురంగ స్వామి దేవాలయంలో అంబాజీ, వెంకటేశ్వర్లు బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి.

- కొత్త పేటలోని కోదండ రామ స్వామి ఆలయంలో కర్నూలు నగర బెస్త తెలుగు, గంగ పుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. భీష్ముడి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. మహాభారత సమయంలో భీష్ముడు అవలంభించిన ధర్మ మార్గాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సంఘం పెద్దలు సూచించారు. సంఘం గౌరవ సలహాదారులు రామయ్య, వీరన్న, నగర అధ్యక్షుడు బాలు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కదిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో ..

శివ భక్తులకు అన్నదానం

కర్నూలు కల్చరల్: స్థానిక దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో గురుస్వామి బొమ్మన రాఘవేంద్రారెడ్డి ఆధ్వర్యంలో శివమాల దీక్షాధారులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం పలువురు దాతలు అన్నదాన ప్రసాద వితరణలో పాల్గొన్నారు. శివపూజ, భజన అనంతరం అన్నదాన ప్రసాదాన్ని వితరణను అడిషనల్ డీఎమ్‌అండ్‌హెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ రాజు ప్రారంభించారు. రెడ్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు దొణపాటి యల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దాతలు అక్కిమి హనుమంతరెడ్డి, సునీల్ రెడ్డి, కపిల్ సింగ్, రమేష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన ప్రసాదాన్ని వడ్డిస్తున్న అడిషనల్ డీఎమ్ అండ్ హెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ రాజు

పీఎం యువ 2.0 రచయితగా తేజ



కర్నూలు కల్చరల్: కర్నూలు ఐఏఎస్ఈ కళాశాల బీఈడీ విద్యార్థి పీవీఎస్ తేజ రచించిన 'ప్రజాస్వామ్యం రాజ్యాంగ విలువలు ప్రభుత్వం' పుస్తకం ఆవిష్కరణ శనివారం జరిగింది. న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరుగుతున్న నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, కేంద్ర విద్యా శాఖ మంత్రివర్యులు ధర్మేంద్ర ప్రధాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పీఎం యువ 2.0 రచయితలుగా ఎంపికైన దేశంలోని వివిధ భాషల్లో 40 మంది యువ రచయితలచే రచింపబడిన నేషనల్ బుక్ ట్రస్ట్, కేంద్ర విద్యాశాఖ ప్రచురించిన పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఇందులో తేజ పుస్తకం కూడా ఉండటం గర్వకారణం. ప్రతిభ కనబరిచిన తేజను కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి, అధ్యాపకులు రాంజపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం అభినందనలు తెలిపారు. మెంటార్‌గా ఉండి తన రచనలకు మార్గదర్శనం చేసిన కప యోగి వేమన విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీష్, సవరణలు చేస్తూ ముందుకు నడిపించిన నేషనల్ బుక్‌ట్రస్ట్ తెలుగు సహాయ సంపాదకులు డాక్టర్ పత్తిపాక మోహన్‌కు తేజ కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల విలీనం సరికాదు


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర సహఅధ్యక్షుడు సురేష్‌కుమార్

కర్నూలు సిటీ: మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరుతో గ్రామ పంచాయతీల్లోని స్కూళ్లన్నింటినీ ఒకే స్కూల్‌లో విలీనం చేయడం సరైంది కాదని యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాల్సింది పోయి మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరుతో విలీనం చేసే ప్రక్రియ అధికారులు వేగవంతంగా చేసుకుంటూ వెళ్తున్నారన్నారు. 60 మందికిపైగా ఉన్న స్కూళ్లను ఎంపిక చేసి, ఆ స్కూల్‌కి కి.మీ పరిధిలో ఇతర ప్రాథమిక స్కూళ్లలోని 3,4,5 తరగతులను విలీనం చేయాలని, మిగిలిన తరగతులను బేసిక్ ప్రైమరీ స్కూల్స్‌గా కొనసాగించాలని కోరారు. ప్రతి స్కూల్లో 1నుంచి 5వ తరగతి వరకు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు, తెలుగు మీడియంను సైతం కొనసాగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రాంతాల్లో ఉన్న స్కూళ్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి, సహ అధ్యక్షుడు హేమంత్‌కుమార్, కార్యదర్శి యోహోషువా తదితరులు పాల్గొన్నారు

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లను తక్షణమే రద్దు చేయాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.బలరాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఆర్‌కే డేవిడ్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ప్రజా పరిరక్షణ సమితి, నాలుగో తరగతి ఇంటి స్థలాల బాధితులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గతంలో పీజీసీ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి బాధితులకు ఆ ప్లాట్లను అప్పజెప్పాలన్నారు. అక్రమాలకు పాల్పడిన జి.బాలనరసింహులు, సి.గోపాలకృష్ణ, అబ్రహం, ఎస్.నాగరాజు, మద్దిలేటి, లోకేష్,ఎస్.జగదీష్ కుమార్‌లపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికృష్ణతోపాటు బాధితులు పాల్గొన్నారు.

పశువైద్యులకు ఆటల పోటీలు


క్యారమ్స్ ఆడుతున్న మహిళా పశువైద్యులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పశువైద్యులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించే పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వెటర్నరీ అసిస్టెంటు సర్జన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిగాయి. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ముందస్తుగా నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్, పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్స్‌పాల్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఆటల పోటీల్లో మహిళా వైద్యులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. షటిల్, క్యారమ్స్, టేబుల్ టెన్నీస్, చెస్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదోని డీడీ వెంకటరమణ, పలువురు ఏడీలు, పశువైద్యులు పాల్గొన్నారు. ఆదివారం క్రికెట్ పోటీలు జరుగుతాయి.


తుంగభద్ర నదిలో చక్రస్నానం నిర్వహిస్తున్న భక్తులు

చక్రస్నానంతో ముగిసిన వేడుకలు


విగ్రహాల ఊరేగింపులో బ్రాహ్మణ సంఘం నాయకులు, భక్తులు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపుగా వెళ్లి తుంగభద్రా నదిలో వేద మంత్రోచ్చారణలతో చక్రస్నానంతో వేడుకలను పూర్తి చేశారు. చక్రస్నానం ఆచరించే సమయంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా గరుడ పక్షి ప్రదక్షిణలు చేసిందని బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. కర్నూలు బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సండేల్ చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజు శర్మ, ఉపాధ్యక్షులు కంచుగంటల శ్యాంసుందర్ రావు, ఉప కార్యదర్శి నాగులవరం రాజశేఖర్ రావు, కోశాధికారి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ సర్వేలు.. ఉద్యోగులపై ఒత్తిళ్లు

- పండుగలు, రెండో శనివారం, ఆదివారాలనూ వదలని నగర పాలక అధికారులు
- ఈ నెల 12లోపు ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు
- ఒత్తిళ్లకు గురవుతున్న సచివాలయాల ఉద్యోగులు


రెండవ శనివారం సెలవురోజున ఎంఎస్ఎంఈ సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



కర్నూలు (టౌన్) : సర్వే అంటేనే నగరపాలక పరిధిలోని సచివాలయాల ఉద్యోగులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రెండవ శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవులు వచ్చాయి.. హమ్మయ్యా కుటుంబ సభ్యులతో గడపవచ్చు అనుకున్న సచివాలయ సిబ్బందికి ఉన్నతాధికారులు షాక్‌ఇచ్చారు. సెలవుల్లోను సర్వే చేయించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. దీంతో తీవ్ర అసహనానికి గురవుతున్నారు ఉద్యోగులు. పనిదినాల్లో ఎలాగూ చేస్తున్నాం.. అయినా సెలవుల్లోను ఇదేం ఒత్తిడి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక పని పేరుతో సెలవులను రద్దు చేస్తున్నారు. మొన్నటికి మొన్న సంక్రాంతి సెలవులను రద్దు చేసి మిస్సింగ్ సర్వే, హౌస్ హోల్డ్ సర్వే పేరుతో పనిచేయించారు. ఇలా...సెలవుల్లోను ఇబ్బందులు పెడుతున్నారని వాపోతున్నారు.

136 సచివాలయాల్లో సర్వే..

నగరపాలక పరిధిలోని 52 వార్డుల పరిధిలోని 136 సచివాలయాల్లో ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సర్వేలను సచివాలయ ఉద్యోగులతో చేపడుతున్నారు. ఇందులో భాగంగా సూక్ష్మ చిన్న , మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ రూపొందించిన యాప్‌లో వ్యాపారులకు సంబంధించిన వివరాలు సేకరించాల్సి ఉంది. షాపు యజమాని ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, షాపు మ్యాపింగ్ వంటి వివరాలు నమోదు చేయాల్సి ఉంది. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి షాపు యజమానిని కలవాలి. ఇప్పటికే ఈ సర్వే ప్రారంభమైంది. ఇప్పటి వరకు 6 వేల మంది చిన్నా చితకా వ్యాపారులకు సంబంధించిన వివరాలు సేకరించారు. అయితే ఈనెల 12వ తేదీ లోపు సర్వేను పూర్తి చేయాలని నగరపాలక అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. సర్వే ఎంత చేశారు. ఏమైంది. ఎప్పుడు పూర్తి చేస్తారు.. ఈ రోజు ప్రగతి ఏంటి అంటూ ఫోన్లతో ఇబ్బందులు పడుతున్నారు. రోజు వారీ నివేదికలకు సంబంధించి సచివాలయాల ఉద్యోగులపై పర్యవేక్షణ కోసం శానిటరీ ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లను క్లస్టర్ల వారీగా నియమించారు. ఏ సర్వే చేయాలన్నా ముందుగా గుర్తుకు వచ్చేది సచివాలయాల ఉద్యోగులే అని వారు వాపోతున్నారు. ఇంత వరకు బీఎల్ఓలు అని సర్వే చేయించారు. సచివాలయాల్లో విధుల సంగతి దేవుడెరుగు... నిత్యం ఏదో ఒకటి సర్వే పేరుతో ఉద్యోగులను వేధిస్తున్నారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.